క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సలకు 75 మంది ఎంపిక



కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికైన వృద్ధులు

కె.కోటపాడు: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడిచర్లలో కంటి వైద్య సిబ్బంది శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. 75 మందికి కంటి పరీక్షలు చేసి, శస్త్రచికిత్సలు అవసరంగా 36 మందిని గుర్తించారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించి ఉచితంగా శస్త్ర చికిత్సలను నిర్వహించి ఇంటికి సురక్షితంగా చేర్చనున్నట్లు ఆప్తాలమిక్ అధికారి దుర్గ భవాని తెలిపారు. క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వినీకుమార్, దీపిక పాల్గొన్నారు.

77 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా సింగన్నదొరపాలెం శివారు రామచంద్రపురంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం 77 మందిని పరీక్షించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎ.ఎన్.ఎం చిన్నమ్మలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లోకి పింఛన్ల సొమ్ము



మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు: మే, జూన్ నెలలకు సంబంధించిన సామాజిక పింఛన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఎంపీడీవో అప్పలరాజు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు వేస్తామన్నారు. దివ్యాంగులకు, అనారోగ్య బాధితుల ఇళ్లకు వెళ్లి పంచాయతీ సిబ్బంది పింఛన్ నగదు ఇస్తారన్నారు. ఈ విషయమై గ్రామాల్లో దండోరా వేయాలని సూచించారు.

మండల టాపర్‌కు ఘన సత్కారం



విద్యార్థి హరీష్‌ను సత్కరిస్తున్న వార్డు కార్యదర్శి రమణ

రోలుగుంట: పదో తరగతి పరీక్షల్లో 577 మార్కులు తెచ్చుకొని మండల టాపర్‌గా నిలిచిన బుచ్చింపేటకు చెందిన కన్నూరి హరీష్‌ను ఘనంగా సత్కరించారు. అధిక మార్కులు తెచ్చుకొని గ్రామానికి గుర్తింపు తెచ్చినందుకు గాను వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ సోమవారం రాత్రి తన ఇంటి వద్ద శాలువాతో సత్కరించారు. హరీష్ ఉన్నత చదువులకు తన వంతుగా సహాయం అందిస్తానన్నారు.

నేడు 12 గ్రామాల్లో ప్రచారం

చీడికాడ: మండలంలోని 12 గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఉదయం 7.30 గంటలకు జైతవరం, 8.30కు బి.సింగవరం, 9.30కు అప్పలరాజుపురం, 10.30కు ఎల్.బి.పట్నం, 11.30కు ఖండివరం, మధ్యాహ్నం 12.30కు వి.బి.పేట, ఒంటి గంటకు లంచ్ బ్రేకు, అనంతరం 3 గంటలకు శిరిజాం, సాయంత్రం 4కు కోనాం, 6కు మంచాల, 7కు చీడికాడ, 8కు తంగుడుబిల్లి, రాత్రి 9కు తురువోలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంతో మగుస్తుందన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

మాకవరపాలెం : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన ఇళ్ల మణిమాల(20) రెండు రోజులుగా కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త తాతాజీ సోమవారం ఫిర్యాదు చేశాడు.



ఎంపీపీ పైల రాజు ఆధ్వర్యంలో తోటకూరపాలెం నుంచి



బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి నుంచి చోడవరం బయలుదేరుతున్న జనం



కొత్తకోట నుంచి వాహనాల్లో భారీగా తరలుతున్న...



సీఎం సభలో చిన్నారి ఆనందం

వైఎస్సార్‌సీపీలో నూతనోత్తేజం

- సీఎం సభకు తరలివచ్చిన అశేష జనం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజానీకం జై కొట్టింది. ఈ ప్రాంతం వైఎస్సార్‌సీపీకి అడ్డా అంటూ చాటిచెప్పింది. చోడవరం వేదికగా నిర్వహించిన భారీ బహిరంగ సభ జయప్రదమై పార్టీలో నూతనోత్తేజాన్ని నింపింది. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన అశేష జనంతో కొండంత బలాన్ని నింపింది. ఈ ఎన్నికల్లో పార్టీకి తిరుగులేదని ఈ సభ నిరూపించడంతో విజయం ఖాయమన్న ధీమా వ్యక్తమవుతోంది.



ఇదే మన గుర్తు : ఫ్యాన్‌గుర్తు చూపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభివాదం చేస్తున్న జనం



బుచ్చెయ్యపేట నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లిన ప్రజలు

చోడవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభతో చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో ఫుల్ జోష్ వచ్చింది. చోడవరం కొత్తూరు జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార సభలో ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన రాకతో పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది ఈ సభకు తరలిరావడంతో చోడవరం పట్టణమంతా కిక్కిరిసింది. పెద్ద సంఖ్యలో ప్రజలు రావడంతో కార్యకర్తల ఆనందం కట్టలు తెంచుకుంది. తమ పార్టీ అధినేతను చూసి మురిసిపోయి కొందరు రోడ్లపై డ్యాన్స్ వేశారు. మండుటెండలో సైతం ఎక్కడా తగ్గకుండా అంతా సభలో కేరింతలు కొట్టారు. వివిధ కారణాలతో కాస్త అసంతృప్తితో తెరవెనక ఉన్న నాయకులు సైతం ఈ సభతో పార్టీ విజయానికి మేము సైతమంటూ ఉత్సాహంతో కదిలారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగానికి అడుగడుగునా చప్పట్లు కొడుతూ తమ ఉత్సాహాన్ని చాటారు. చెప్పానంటే చేస్తానంటూ ఆయన చేసిన ప్రసంగంతో కార్యకర్తల్లో మరింత నమ్మకాన్ని పెంచిందనే చెప్పాలి. ఏదేమైనా సీఎం జగన్ సభ చోడవరం వైఎస్సార్‌సీపీలో కొత్త జోష్‌ను నింపిందంటూ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, బుచ్చెయ్యపేట, రోలుగుంట మండల అధ్యక్షులు కొలిమల్ల అచ్చెన్నాయుడు, గొర్లి వెంకటరామన్, సీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముక్క మహాలక్ష్మీనాయుడు, రోలుగుంట ఎంపీపీ యర్రంశెట్టి శ్రీను, పార్టీ సీనియర్ నేతలు లక్ష్మీశ్రీనివాస్, కంచిపాటి జగ్గారావు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభకు తరలిన ప్రజలు

బుచ్చెయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చోడవరంలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభకు బుచ్చెయ్యపేట మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తమ కుటుంబాలు బాగుపడేలా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న జననేత జగనన్న తమ ప్రాంతానికే వస్తున్నాడని తెలిసి, పలు గ్రామాల నుంచి అవ్వతాతలు, మహిళలు, రైతులు, యువకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి తమ పనులు మానుకుని ఆటోలు, ఇతర వాహనాల ద్వారా బయలుదేరారు. పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, మండల ఇన్‌చార్జి గేదెల శేషు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, నాయకులు అప్పలనాయుడు, సుంకరి శ్రీను, గాంధీ, అప్పారావు, మాణిక్యం పాల్గొన్నారు.

రావికమతం: చోడవరంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, మహిళలు భారీగా తరలి వెళ్లారు. ఎంపీపీ పైల రాజు, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, మత్స భవానీప్రసాద్, మండల పరిషత్ ఫ్లోర్ లీడర్ పూడి దేవా, ఎక్స్ అఫిషియో సభ్యుడు గాలి రమణబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో వాహనాల్లో వేలాదిగా తరలి వెళ్లారు. వీరికి తాగునీరు, అల్పాహారం వంటి అన్ని సౌకర్యాలను అందించారు.

జగన్‌బాబు మళ్లీ రావాల



మాలాంటి ముసలోళ్లకు జగన్‌బాబు ఎంత ధైర్యం కల్గితున్నాడు. నెల నెలా కోడికూజ్జామునే వాలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తున్నాడంటే.. ఎవరి చలవ జగన్‌బాబుదే. ప్రభుత్వ ఉద్యోగికైనా అలా వస్తున్నాయా.. లేదు కదా. మాలాంటోళ్లందరినీ ఒక తండ్రిలా చూసుకుంటున్న జగనబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. ఆ బాబు చల్లగ ఉండాలి. ఆయనకు ఓటేసి గెలిపించుకుంటాం. అందుకే శివారు మండలమైనా ఎండైనా కష్టపడి వచ్చాను.

– మరిశా రమణ, జె.నాయుడుపాలెం, రోలుగుంట మండలం

మళ్లీ తప్పకుండా గెలుస్తాడు



మా జగనన్న మళ్లీ వైఎస్ఆర్ ఆసరా ఇస్తానన్నారు. నాలాంటోళ్లందరికీ ఈ దఫా వర్తిస్తుంది. ఆ సొమ్ముతో ఏదైనా వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటాను. జన ప్రభంజనం చూస్తున్నారు గదా.. మళ్లీ తప్పకుండా గెలుస్తాడు. నాలాంటి పేదోళ్లందరూ ఆయనకు అండగా ఉంటారు. ఇక్కడ మా ధర్మశ్రీని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం... ఇది ముమ్మాటికీ జరుగుతుంది.

– వెలుగుల చినమ్మలు, చోడవరం

జగన్‌బాబును చూడటంతో సంతోషం



జగన్‌బాబు ఇచ్చే పింఛన్ మీదే ఆధారపడి జీవిస్తున్నాను. నా మనవడు జగన్‌బాబు చోడవరం వస్తున్నాడని తెలిసి తీవ్ర ఎండ కాస్తున్నా లెక్కచేయకుండా మా ఊరు నుంచి వచ్చాను. నా మనవడిని దూరం నుంచి చూశాను. జగన్‌బాబును చూడటంతో చాలా సంతోషంగా ఉంది. జగన్‌బాబే మరలా సీఎం అవుతాడు. మాలాంటోళ్లకు అండగా ఉంటాడు.

– విశ్వారపు దేముమ్మ, వృద్ధురాలు, నరసాపురం

జగనన్న పథకాలతో లబ్ధి



జగనన్న మా ప్రాంతానికి రావడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు మా కుటుంబానికి అందుతున్నాయి. ఈ ప్రభుత్వం వల్ల మాకు మేలు జరిగింది. జగనన్నను చూద్దామని ఎండ కాస్తున్న బయలుదేరి వచ్చాను. జగనన్నను చూశాను. అందరికి మంచి చేస్తున్న జగనన్నే మరలా ముఖ్యమంత్రి అవుతారు.

– నెల్లాలి నిహారిక, దుడ్డుపాలెం

అమ్మఒడితో చదువుకు మరింత ఊతం



అమ్మఒడి పథకానికి ఇంత ముందు కన్నా జగనన్న నిధులు పెంచారు. మా పిల్లలు భవిష్యత్ బంగారం అవుతుంది. జగనన్న ఎప్పుడూ పేదల గురించే ఆలోచిస్తున్నారు. అన్న చల్లగుండాలి. మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. పిల్లలు దేవుళ్లంటారు. ఆ పిల్లల ఆశీస్సులు జగనన్నకుంటాయి.

– మేడారపు రమణమ్మ, చోడవరం

మాకు అండగా జగన్‌బాబు



మాలాంటి దివ్యాంగులకు ప్రతి నెలా పింఛన్, రేషన్ బియ్యం ఇంటికే అందేలా చేసిన జగన్‌బాబును చూడాలని మా ఊరు నుంచి వచ్చాను. చాలా మంది రావడంతో జనాలతో రోడ్లన్నీ రద్దీగా ఉన్నాయి. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. జగన్‌బాబును చూడటంతో సంతోషంగా ఉంది. మరలా జగన్‌బాబు రెండోసారి ముఖ్యమంత్రి అవుతాడు.

– గొర్లె రమణ, దివ్యాంగుడు, ముదుర్తి

మీ ఇంటి ఆడ బిడ్డగా ఆశీర్వదించండి

- మీకు సేవకురాలిగా పని చేస్తాను
- 16 గ్రామాల ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ
- ఎండను సైతం లెక్క చేయకుండా రైతులను కలసి అభ్యర్థన



ముకుందపురంలో ప్రచార వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



పోతనపూడిలో సమావేశానికి హాజరైన ప్రజలు



అవురువాడ వీరనారాయణంలో గిరిజన చిన్నారులను ఎత్తుకుని భరోసా కల్పిస్తున్న అనురాధ

మాడుగుల: ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా అందించిన సంక్షేమం, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో చేసిన అభివృద్ధి చూసి మీ ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆమె ముకుందపురంలోరాములవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి తీన్‌మార్, కోలాటాలు నడుమ ర్యాలీ ప్రారంభించి ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేసుకుంటూ పోతనపూడి అగ్రహారం చేరుకున్నారు. పెద్ద ఎత్తున జై జగన్, జై బూడి, జై అనురాధ నినాదాలతో అక్కడ నుంచి వీరవల్లి, గొటివాడ అగ్రహారం, వీరనారాయణం, చింతలూరు, జంపెన, గాదిరాయి, ఎం. కృష్ణాపురం, అవురువాడ, కింతలి వల్లాపురం, కింతలి, పొంగలిపాక, వీజేపురం, ఒమ్మలి, జేడీపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. 2014 ఎన్నికల మేనిఫెస్టో హామీల్లో చంద్రబాబు సగం కూడా అమలు చేయలేకపోయారని విమర్శించారు.

మరలా ఇప్పుడు దగా మేనిఫెస్టోతో వలస పక్షులను పంపిస్తున్నారని, వారిని మన గడపకు రాకుండా తిప్పి పంపించాలన్నారు. టీడీపీ, బీజేపీ అభ్యర్థుల్లో ఎవరు నాయకులో వారికే తెలియని పరిస్థితులున్నాయని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 మేనిఫెస్టోను 99 శాతం అమలు చేశారన్నారు. కొత్త మేనిఫెస్టో ప్రకారం మరలా పథకాలు కొనసాగాలంటే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకటరాజామ్, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, మాడుగుల, దేవరాపల్లి మండలాధ్యక్షులు వేమవరపు రామధర్మజ, బూరే బాబూరావు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, కర్రి గణేష్, కోరుకొండ చెల్లంనాయుడు, సయ్యపురెడ్డి నారాయణరావు, విస్సారపు రామారావు, దాడి మహేష్, కాళింగ కళ్యాణ రాజు, నేమాల గురువు నాయుడు, పర్రే రాము నాయుడు, పర్రే వెంకటరమణ, బొద్దపు భాస్కరరావు, బొద్దపు దేవునాయుడు, గూడెపు హరికృష్ణ, కాళ్ల రాము, ఆడారి కన్నారావు, కాళ్ల అప్పలనాయుడు, తాళ్లపురెడ్డి రాంబాబు, తంటపురెడ్డి భన్ని, కొసిరెడ్డి కృష్ణమూర్తి, గూడెపు హరికృష్ణ, నాయిన ధన, కరణం రాము, జనపరెడ్డి అప్పారావు, కరణం త్రినాథరావు, ఎలగాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

చోడవరం బరిలో 6, మాడుగులలో 9 మంది

- ఇద్దరు నామినేషన్ల ఉప సంహరణ

మాడుగుల/చోడవరం: చోడవరం అసెంబ్లీ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. ప్రధాన పార్టీలతోపాడు ఒకరు ఇండిపెండెంట్ అభ్యర్థి ఈ సారి ఎన్నికల బరిలో ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. మొత్తం ఎనిమిది మంది నామినేషన్లు వేయగా స్క్రూటినీలో ఇద్దరు అభ్యర్థుల నామినేషన్ తిరస్కరించామని కేటాయించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్ని కృష్ణ తెలిపారు. టీడీపీ రెబల్ అభ్యర్థులు గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు తమ నామినేషన్లు సోమవారం ఉపసంహరించుకున్నారు. దీంతో మాడుగుల నియోజకవర్గంలో 9 మంది అభ్యర్థులు బరిలో నిలిచారని ఆర్వో జి.వి. సత్యవాణి తెలిపారు.

చోడవరం బరిలో ఆరుగురు

అభ్యర్థి	పార్టీ	గుర్తు
కరణం ధర్మశ్రీ	వైఎస్సార్ సీపీ	ఫ్యాన్
జగతా శ్రీనివాసరావు	కాంగ్రెస్ పార్టీ	హస్తం
వేగి మహాలక్ష్మినాయుడు	బీఎస్పీ	ఏనుగు
కలిదిండి నాగు సూర్య సన్యాసిరాజు	టీడీపీ	సైకిల్
సవరాల గణేష్	సీపీఐ(ఎంఎల్)	జెండాపై మూడు స్టార్లు
పేరిచెర్ల వివేక రాజు	ఇండిపెండెంట్	బకెట్ గుర్తు

మాడుగుల బరిలో 9 మంది అభ్యర్థులు

అభ్యర్థి	పార్టీ	గుర్తు
ఈర్లె అనురాధ	వైఎస్సార్ సీపీ	ఫ్యాన్
బండారు సత్యనారాయణ మూర్తి	టీడీపీ	సైకిల్
బొడ్డు శ్రీనువాసరావు	కాంగ్రెసు పార్టీ	హస్తం
కరణం తిరుపతిరావు	బీఎస్పీ	ఏనుగు
తాళ్ల రవి	నవభారత నిర్మాణ సేవ పార్టీ	టి.వి
లెక్కల ఈశ్వరరావు	జై భీమ్‌రావ్‌భారతి పార్టీ	కోటు
బి. రవికుమార్	ఇండిపెండెంట్	గన్న కిసాన్
మతల ఆదినాయుడు,	ఇండిపెండెంట్	కత్తెర
మల్లారపు లోవ చంద్	ఇండిపెండెంట్	విజిల్

అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీకి ఓటేయండి

- టీడీపీ, బీజేపీ అభ్యర్థుల మాయమాటలు నమ్మొద్దు
- డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ విస్తృత ప్రచారం



దేవరాపల్లి రెల్లి వీధిలో ప్రచారం చేస్తున్న బూడి రమణమ్మ

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దేవరాపల్లిలో రెల్లివీధి, చిన్నంనాయుడు నగర్‌లో ప్రతీ ఇంటికి వెళ్లి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధలను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రతీ ఇంటా ఆత్మీయ స్వాగతం పలికి తమ మద్దతు ప్రకటించారు. అవినీతి ఆస్కారం లేకుండా అందిస్తున్న సంక్షేమ పథకాలు మరలా కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా గెలిపించుకోవడం అవసరమన్నారు. స్థానికేతరులైన టీడీపీ ఎమ్మెల్యే, బీజేపీ ఎంపీ అభ్యర్థుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఎన్నికలు పూర్తయ్యాక వారంతా కనిపించే పరిస్థితి ఉండదని ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపు రెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాయకుడు వరదపురెడ్డి లలితానాయుడు, నాయకుడు గండిపడాల అప్పలరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, వేచలపు వాణి, వరదపురెడ్డి చంద్రరావు, రజనీ, వరదపురెడ్డి రమేష్, సోమిరెడ్డి వరలక్ష్మి, నమ్మి నాగరాజు, కొరుపోలు శ్రీను, జీ సంతోష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అనకాపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులకు పిర్యాదు అందింది. ఎస్ఐ తేజేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం ...మండలంలో దిబ్బపాలెం గ్రామానికి చెందిన సూరిశెట్టి వెంకటరామారావు(58) ఈనెల 21న దిబ్బపాలెం నుంచి అనకాపల్లికి ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగివెళుతుండగా, ఇంటి సమీపంలో ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి జారి పడిపోయాడు. తలపై తీవ్ర గాయమవడంతో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వెంకటరామారావు మృతిచెందినట్టు మృతుడి తమ్ముడు లీలా కృష్ణసీతారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఠారెత్తుతున్న ఎండలు



నిర్మానుష్యంగా కె.జె.పురం- అప్పలరాజుపురం ప్రధాన రహదారి

మాడుగుల రూరల్: ఎండల తీవ్రతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రతకు వృద్ధులు, చిన్నారులు బయటకు తిరగడం లేదు. ఉపాధి, వ్యవసాయ కూలీలు తమ పనులు ముగించుకుని వెనువెంటనే ఇళ్లకు చేరుతున్నారు. చల్లని పానీయాలకు డిమాండ్ పెరిగింది. దూర ప్రాంతాలకు వెళ్లే బాటసారులు, వాహనచోదకులు ప్రయాణాలు సాగించడం లేదు. మధ్యాహ్నానికే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.